సాక్షి
గుంటూరు
శుక్రవారం । 7 । జూలై । 2023



దుర్గమ్మ సన్నిధిలో

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బి.ముత్యాలనాయుడు గురువారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



శివుని సేవలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం లభించింది.



నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

విజయవాడ: ఎయిర్ పోర్ట్ కారిడార్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం పనులను పరిశీలించారు.

న్యూస్‌రీల్


సాహస అవార్డుల దరఖాస్తుకు నేడు ఆఖరుతేదీ

నరసరావుపేట ఈస్ట్: జాతీయ సాహస అవార్డులకు విశేష ప్రతిభ కనబరిచిన భారతీయ పౌరుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ ఎస్.పల్లవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వశాఖ టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు 2020, 2021, 2022 సంవత్సరాలలో భూమి, ఆకాశం, సముద్రాలు, ఇతర లైఫ్ అచీవ్‌మెంట్ ప్రతిభ కనబరిచిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి గల వ్యక్తులు అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 7వ తేదీలోగా నమోదు చేసుకొని రెండు కాపీలను తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 0863–2234176 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపు ఎన్జీరంగా వర్సిటీలో రైతు దినోత్సవం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఈనెల 8న వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా రైతు దినోత్సవం నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 519.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.90 అడుగుల వద్ద ఉంది.

170 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల వారీగా 170 మంది ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో డీఈఓ పి.శైలజ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ గురువారం ముగిసింది. గురువారం స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లిష్–46, బయాలాజికల్ సైన్స్–43, గణితం–56, ఫిజికల్ సైన్స్–25 పోస్టుల చొప్పున సీనియార్టీ ప్రాతిపదికన అర్హులైన ఉపాధ్యాయులతో భర్తీ చేశారు. కాగా రెండు రోజుల పాటు జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 244 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి, సీనియర్ హెచ్ఎంలు ఆవుల తిరుమలేష్, రమేష్, ప్రసాద్, ఉర్దూ డీఐ షేక్ ఖాసిం, ఐటీ సెల్ సిబ్బంది శివనాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

యార్డులో 46,698 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 44,367 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 46,698 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి రూ.25,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,519 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,000, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ.1,500 వరకు పలికింది.

ప్రా'ధాన్యం'పై పైత్యం

ఐదు రోజుల్లో జమ

నేను పండించిన ధాన్యాన్ని గ్రామంలోని రైతుభరోసా కేంద్రం ద్వారా ఫిబ్రవరి 20న అమ్మా. ధాన్యాన్ని అమర్తలూరులోని రైస్‌మిల్‌కు చేర్చాలని ఆర్‌బీకే సిబ్బంది సూచించారు. 53 క్వింటాళ్లు అదే మిల్లుకు తరలించాను. అలాగే ఫిబ్రవరి 18న ముత్తాయపాలెం ఆర్‌బీకే ద్వారా బాపట్లలోని వెంకటేశ్వర రైస్‌మిల్‌కు 54 క్వింటాళ్లు తరలించాను. ధాన్యం తోలిన ఐదు రోజుల్లోనే ఫిబ్రవరి 23న ధాన్యం తాలూకు రూ.2,20,420, రవాణా ఖర్చుల కింద రూ. 2,750 మొత్తం రూ. 2,23,170 నా ఖాతాలో జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

– అంగిరేకుల సుబ్బారావు, ముత్తాయపాలెం



సంతోషంగా ఉంది

నాకున్న మూడెకరాల పొలంలో వరి సాగుచేశా. 96 బస్తాల దిగుబడి వచ్చింది. పిన్నిబోయినవారిపాలెం రైతుభరోసా కేంద్రం ద్వారా విక్రయించా. ఆర్‌బీకే సిబ్బంది సూచనల మేరకు బాపట్ల పట్టణంలోని రైస్ ట్రేడర్స్‌కు ఫిబ్రవరి 17న ధాన్యం తరలించా. ఫిబ్రవరి 22న నా అకౌంట్‌లో ధాన్యం తాలూకు రూ.1,47,840, రవాణా ఖర్చుల కింద రూ.1,630 మొత్తం రూ. 1,49,470 నగదు జమ చేశారు. గత ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నగదు త్వరగా చెల్లించేవారు కాదు. ఇప్పుడు రోజుల వ్యవధిలోనే డబ్బులు జమయ్యాయి. సంతోషంగా ఉంది.

– మద్దిబోయిన రామకృష్ణ, పిన్నిబోయినవారిపాలెం



వీరిద్దరికే కాదు.. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం అమ్మిన అందరికీ రోజుల వ్యవధిలోనే డబ్బులు జమయ్యాయి. ఫలితంగా అన్నదాతలు సంతోషంగా ఉన్నారు. అయినా పచ్చపత్రికలు ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయి.


ప్రభుత్వంపై 'పచ్చ'బురద

- అన్నదాతలకు అండగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం
- మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు
- పదిరోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ
- దళారుల బెడదకు చెక్
- నేరుగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి అమ్ముకొనే వెసులుబాటు
- అయినా బురదజల్లుతున్న పచ్చ పత్రికలు
- తప్పుడు రాతలపై కర్షకాగ్రహం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నదాతల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తోంది. రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించడంతోపాటు మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొని అండగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతే ఎప్పటికప్పుడు పరిహారం, పంటల బీమా నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇంతచేస్తున్నా పచ్చపత్రికలు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయి. తాజాగా ధాన్యం కొనుగోళ్లపైనా పైత్యం ప్రదర్శించాయి. ధాన్యం కొనుగోళ్లు మొక్కుబడిగా జరుగుతున్నాయని, నగదు జమ కావడం లేదని తప్పుడు కథనాలు రాశాయి. ఫలితంగా రైతుల్లో అభాసుపాలయ్యాయి. తమ ధాన్యాన్ని వెళ్లిన వెంటనే కొంటున్నారని, పది రోజులు తిరక్కుండానే నగదు జమవుతోందని రైతులే చెబుతున్నారు. ఎల్లో మీడియా విషపు రాతలపై ధ్వజమెత్తుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ఇలా...

బాపట్ల జిల్లాలో ఖరీఫ్, రబీలలో ధాన్యాన్ని 142 ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఖరీఫ్‌లో 1,40,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, 10,876 మంది రైతుల నుంచి 78,333.670 టన్నులు సర్కారు కొన్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వరికోత తరువాత ధాన్యాన్ని కుప్పలుగా వేస్తారు. పైగా ఈ ప్రాంతంలో ఎక్కువగా బీపీటీ 5204 రకం ధాన్యం పండించారు. బయట మార్కెట్‌లో బీపీటీ 5204 రకానికి ధర ఎక్కువగా ఉండడంతో ఆ ధరకు రైతులు ధాన్యం అమ్ముకున్నారు. రబీలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా 6,437 మంది రైతుల వద్ద నుంచి 38,676 మెట్రిక్ టన్నులు ప్రభుత్వం సేకరించింది. మొత్తం రూ. 79.65 కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.78.86 కోట్లు చెల్లించారు. మిగిలిన రైతులకు బ్యాంక్‌లో ఎన్‌పీసీఐ లింకు కాకపోవడం వల్ల జమ ఆలస్యమైంది. ఇంకా రూ.79 లక్షలే చెల్లించాలి. ఎక్కువ మంది రైతులకు పది రోజుల్లోపే నగదు జమ జరిగింది. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం రబీలో ఏప్రిల్ 20 నుంచి జూన్ 26 వరకూ ధాన్యం కొనుగోలు చేశారు. జూన్ 26న కొన్న ధాన్యానికీ జూలై ఒకటికల్లా నగదు రైతుల ఖాతాల్లో జమ చేశారు.



ధాన్యం ఎత్తుతున్న రైతులు (ఫైల్)

వారంలోనే నగదు జమ



జిల్లాలో రైతులు అమ్మిన ధాన్యానికి ప్రభుత్వం వెంటనే నగదు చెల్లించింది. జిల్లాలో 6,437 మంది రైతుల నుంచి 38,676.36 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొన్నది. వారికి మొత్తం రూ.79.65 కోట్లు చెల్లించాల్సి ఉండగా మొత్తం రూ.78.86 కోట్లు చెల్లించింది. రైతుల ఖాతాలకు ఎన్‌పీసీఐ లింకు కాకపోవడం వల్ల రూ.79 లక్షలు జమకాలేదు.

–వి.శ్రీలక్ష్మి, జిల్లా పౌర సరఫరాలశాఖ మేనేజర్

జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు కృషి

మంత్రి మేరుగ నాగార్జున



కొల్లూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. గురువారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా కొల్లూరు ఎస్సీ ఏరియాలోని ఆయన విగ్రహానికి మంత్రి మేరుగ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వెనకబాటుతనాన్ని పారదోలాలన్న లక్ష్యంతో జగ్జీవన్‌రామ్ రాజీలేని పోరాటాలు చేసి ఎన్నో విజయాలను సాధించారని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుందామన్నారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, ఇంటూరి ప్రవీణ్, సుగ్గున అశోక్, అమిరిశెట్టి శ్రీధర్, వేమూరు మార్కెట్‌యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు కూచిపూడి మోషే, చిలక ప్రకాశం, ఆళ్లమూడి మధు, ఘంట శివరంగారావు, అయిల సుబ్బారావు, నర్ర బుల్లిబాబు, బొర్ర నాగేశ్వరరావు, బారెడ్డి సుబ్బారెడ్డి, రమేష్, దున్న మేరీసుబాబు, తోడేటి రత్నాకర్, మాతంగి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



బైపాస్ సర్జరీ చేయించుకుని డిశ్చార్జ్ అయిన కిషోర్‌కు పండ్లు అందిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్, వైద్యులు

జీజీహెచ్‌లో తొలి బైపాస్ సర్జరీ విజయవంతం


- పూర్తిగా కోలుకున్న రోగి కిషోర్
- ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్
- జీజీహెచ్‌లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పేదలకు ఉచితంగా గుండె బైపాస్ సర్జరీలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన గుండె బైపాస్ సర్జరీల ఆవశ్యకతను గుర్తించి తిరిగి ప్రారంభించేలా చేసింది. అందులో భాగంగా తొలిగా గతనెల 26న గుంటూరు ఏటీఅగ్రహారం 4వ లైనుకు చెందిన న్యాయవాది కొరివి కిషోర్‌కు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో సహృదయ ట్రస్టు సహకారంతో విజయవంతంగా బైపాస్ సర్జరీ జరిగింది. కిషోర్ పూర్తిగా కోలుకోవడంతో గురువారం అతనిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

నిరంతరం గుండె ఆపరేషన్లు జరిగేలా చర్యలు

తొలి గుండె బైపాస్ సర్జరీ విజయవంతమైన సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గురువారం శస్త్రచికిత్సలో పాల్గొన్న సీటీఎస్ వైద్యులు, మత్తు వైద్యులను అభినందించారు. తొలుత జీజీహెచ్‌పై నమ్మకంతో ఆపరేషన్ చేయించుకున్న కిషోర్‌ను అభినందించారు. జీజీహెచ్‌లో లివర్, కిడ్నీ, మోకీళ్ల మార్పిడి, ఇతర అన్ని రకాల ఆపరేషన్లు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. జీజీహెచ్‌లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో ప్రతి వారం బైపాస్ సర్జరీలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ విజయలక్ష్మి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ మహేష్, డాక్టర్ పోలయ్య, డాక్టర్ రామరాజు, డాక్టర్ నాగభూషణం, రెడ్‌క్రాస్ చైర్మన్ రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు, గోఖలేకు, మంత్రి రజినికి రుణపడి ఉంటా



ఎనిమిది నెలలుగా గుండె సమస్యతో పలు ఆస్పత్రులు తిరిగా. రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నా రూ.3 లక్షల వరకు భరించాలన్నారు. డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే గుంటూరు జీజీహెచ్‌లో బైపాస్ సర్జరీ చేస్తున్నారన్న విషయం తెలుసుకుని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి సమస్య వివరించా. గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ విజయలక్ష్మి సూచనతో గతనెల 20న డాక్టర్ గోఖలేను కలిసి పరిస్థితి వివరించా. ఆయన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాకు గత నెల 26న ఉచితంగా బైపాస్ సర్జరీ చేశారు. జీజీహెచ్‌లో గుండె ఆపరేషన్లు తిరిగి మొదలయ్యేలా చర్యలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి కృతజ్ఞతలు. డాక్టర్ గోఖలేకు ధన్యవాదాలు. వీరికి జీవితాంతం రుణపడి ఉంటా. రక్తపు బ్యాగులు ఉచితంగా అందజేసిన రెడ్‌క్రాస్ చైర్మన్ రామచంద్రరాజుకు కృతజ్ఞతలు. ఆస్పత్రిలో సేవలు బాగున్నాయి.

– బైపాస్ సర్జరీ చేయించుకున్న కొరివి కిషోర్‌కుమార్

తాడికొండలో 62.2 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా తాడికొండ మండలంలో 62.2 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తెనాలి మండలంలో 2 మి.మీ వర్షం పడింది. సగటున 26.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలై మాసంలో 6వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 31.9 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 88.7 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు పునరంకితం

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు పునరంకితమవుదామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ సమసమాజస్థాపన కోసం జగ్జీవన్‌రామ్ అహర్నిశలూ శ్రమించారని పేర్కొన్నారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పార్లమెంటులో బలమైన వాణిని విన్పించిన ఉత్తమ పార్లమెంటేరియన్ అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహనరావు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్, జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రారెడ్డి, జెడ్పీ ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

డిగ్రీ కోర్సులు కొత్తగా..

డిగ్రీ డిగ్నిటీ

- ఇంజినీరింగ్‌కు దీటుగా ..
- విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపే లక్ష్యం
- భావవ్యక్తీకరణతోపాటు ఉద్యోగావకాశాలు చూపే దిశగా రూపకల్పన
- జాతీయ విద్యావిధానం అమల్లో భాగంగా మార్పులు
- ప్రవేశాలకు 12వ తేదీ వరకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: సంప్రదాయ డిగ్రీ కోర్సులు సరికొత్తగా రూపుదిద్దుకున్నాయి. కాలానుగుణంగా ఆధునిక సాంకేతికతను అద్దుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమల్లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో కొలువుదీరాయి. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధునిక కాలానికి తగిన విధంగా వీటిని తీర్చిదిద్దింది. పీజీ విధానంలో పూర్తిగా ఒక సబ్జెక్టుపై డిగ్రీ విద్యను అభ్యసించేలా ప్రభుత్వం కరిక్యులమ్‌తోపాటు సిలబస్‌లో మార్పులు చేసింది.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే రాష్ట్ర ప్రభుత్వం వీటిని అమల్లోకి తేవడంతో ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో కొత్త కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గుంటూరు, బాపట్లలోని మహిళా కళాశాలలతో పాటు చేబ్రోలు, రేపల్లె, వినుకొండ, మాచర్లలోని కో–ఎడ్యుకేషన్ కళాశాలల్లో అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి.

ఇంటర్మీడియెట్ విద్య అనంతరం అత్యధిక శాతం మంది విద్యార్థులు ఇంజినీరింగ్‌వైపు వెళ్తున్న పరిస్థితుల్లో సంప్రదాయ డిగ్రీ కోర్సులను ప్రభుత్వం ఆధునికంగా తీర్చిదిద్దింది. ఆయా కోర్సుల్లో మూడేళ్ల కాలానికి సాధారణ, నాలుగేళ్ల కాలానికి ఆనర్స్ సర్టిఫికెట్ అందించనుంది. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేసి, ఉపాధికి బాటలు చూపేలా రూపుదిద్దుకున్నాయి. భాషా, సాంకేతికతతోపాటు వృత్తి నైపుణ్యాలను పెంపొందించే ఇంటర్న్‌షిప్, పారిశ్రామిక శిక్షణ చదువులో అంతర్భాగమయ్యాయి. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య విద్యార్థులు నాణ్యమైన విద్యనభ్యసించి ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం కలిగింది.



గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాల తరగతి గదిలో విద్యార్థినులు

ఆంగ్ల మాధ్యమం, సెమిస్టర్ విధానం

కొత్త డిగ్రీ కోర్సులు ఆంగ్ల మాధ్యమ బోధన, సెమిస్టర్ విధానంతో అందుబాటులోకి వచ్చాయి. టెన్త్, ఇంటర్మీడియెట్ స్థాయిల్లో ఆంగ్ల మాధ్యమంలో చదివిన విద్యార్థులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా డిగ్రీలో అదే మాధ్యమాన్ని కొనసాగించవచ్చు. తద్వారా భాష, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని కార్పొరేట్ కొలువులను సాధించే స్థాయికి చేరుకోవచ్చు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు, మూల్యాంకనం ద్వారా విద్యార్థి అభ్యసన స్థాయి పెరుగుతుంది.

ఇవిగో పలు కొత్త కోర్సులు

- బీఎస్సీ లైఫ్‌సైన్సెస్‌లో బోటనీ, జువాలజీ, ఆక్వా కల్చర్, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, హోమ్‌సైన్స్, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ కోర్సులతో పాటు బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్‌లో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటాసైన్స్ వంటి ఆధునిక కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.
- బీఏలో ఫైనాన్షియల్ ఎకనామిక్స్, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరరీ స్టడీస్, తెలుగు భాష–సాహిత్యం, పొలిటికల్ సైన్స్ అందుబాటులో ఉన్నాయి.
- బీకాంలో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, అకౌంటింగ్ అంగ్ టాక్సేషన్, బ్యాంకింగ్–ఇన్సూరెన్స్–ఫైనాన్షియల్ సర్వీసెస్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ కోర్సులు ఉన్నాయి.

దరఖాస్తుకు గడువు పెంపు

డిగ్రీ ప్రవేశాలకు శుక్రవారం ముగిసిన గడువును ప్రభుత్వం ఈనెల 12వ తేదీ వరకు పొడిగించింది. విద్యార్థులు ఆన్‌లైన్‌తోపాటు నేరుగా ఆయా కళాశాలలకు వెళ్లి, రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలుంది.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం



విద్యార్థినుల కోసం గుంటూరులో పూర్తిస్థాయి బోధన వసతులతో ప్రభుత్వ మహిళా కళాశాల ఉంది. అత్యాధునిక కోర్సులు ఉన్నాయి. 75 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ టీం, ల్యాబ్స్, డిజిటల్ తరగతి గదులు ఉన్నాయి. డాక్టరేట్ కలిగిన అధ్యాపకులతోపాటు అటానమస్ హోదా పొందిన కళాశాల ద్వారా ఆధునిక సదుపాయాలతో కూడిన విద్య అందిస్తున్నాం. కళాశాలలో ప్రవేశం పొందగోరు విద్యార్థినుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. దూర ప్రాంత విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉంది.

– డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు

ఆప్త'మిత్రులు'గా ఉండాలి

గుంటూరు మెడికల్: రోగులకు ఆప్తమిత్రులుగా ఉండాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. జీజీహెచ్ అత్యవసర విభాగంలో గురువారం ఆరోగ్యమిత్ర కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అత్యవసర విభాగంలో రోగులకు కనపడకుండా కౌంటర్ ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు కనపడకుండా ఉంటే రోగులకు ఎలా సేవలు అందిస్తారంటూ ఆరోగ్యమిత్రను ప్రశ్నించారు. రోగిని సొంత మనిషిలా చూసుకోవాలన్నారు. అందుకు విరుద్ధంగా పని చేస్తున్నట్లు జీజీహెచ్‌లో కనిపిస్తోందని, ఆరోగ్య మిత్రల పద్ధతుల్ని మార్చుకోవాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో పని చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోదామని.. తనకు ఇష్టం కాబట్టే ఇక్కడ ఉద్యోగం చేస్తున్నానని వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని, ఇందుకోసం వందల కోట్ల రూపాయల్ని ఖర్చు పెడుతున్నట్లు వెల్లడించారు. మనిషికి వచ్చే ప్రతి జబ్బు ఆరోగ్యశ్రీ కిందకు వస్తోందని, రూపాయి ఖర్చు లేకుండా రోగికి వైద్యం అందించే బాధ్యత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కలల్ని ఆరోగ్యమిత్రలు సాకారం చేయాలని సూపరింటెండెంట్ చెప్పారు.

చోరీ ఎవరు చేసి ఉంటారు?

- కొత్తపేట ఘటనతో ఉలిక్కిపడ్డ పోలీసులు
- నిందితుల కోసం ముమ్మర గాలింపు
- వివరాలు సేకరించిన క్రైం ఏఎస్పీ


చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): గుంటూరు కొత్తపేట మంగళబావి సందులో బుధవారం రాత్రి జరిగిన భారీ చోరీ కేసులో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. సూరినేడి నరసింహా రావు నివాసంలో సుమారుగా మూడు కిలోల బంగారం, రెండు కిలోల వెండి, రూ.2 లక్షల వరకు నగదు పోయిన పరిస్థితుల్లో కేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే కొత్తపేట పీఎస్ బృందాలతో పాటు, సీసీఎస్, ఇతర క్రైం పార్టీలను భాగస్వామ్యులను చేస్తూ.. ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. బుధవారం అర్ధరాత్రి విషయం తెలుసుకున్న కొత్తపేట సీఐ అన్వర్ బాషా, కాకాని సీఐ సురేష్‌బాబు సంఘటన జరిగిన ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. జాగీలాలతో విచారణ చేసిన క్రమంలో జరిగిన నివాసం నుంచి పాత అభిలాష్ హోటల్ ప్రధాన రహదారి, అక్కడి నుంచి శివాలయం మీదుగా తిరిగి మంగళబావి సందు చివర ఉన్న సాయిబాబా ఆలయం వరకు వచ్చి ఆగిపోయాయి.

వాన కారణంగా రోడ్లన్నీ బురదమయం కావటంతో జాగీలాలు సైతం ఆచూకీ కనిపెట్ట లేకపోయాయని పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే సీసీ పుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు నిందితుడి విషయంలో ఒక నిర్ధారణకు రాలేదని తెలుస్తోంది. ఇది పక్కాగా నేరస్తులు చేసిన పనా? లేక పూర్తిగా నరసింహారావు కుటుంబసభ్యులు బయటకు వెళ్లారని తెలుసుకుని.. తెలిసిన వారు చేసిన పనా? అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. నివాసంలో అద్దెకు ఉండే ఓ మహిళ రెండు సంచులు తీసుకుని వెళ్తున్నట్లు చెబుతున్న పరిస్థితుల్లో.. చోరీ జరిగిన అంశంలో అనేక అనుమానాలకు తావిస్తోంది. కొద్ది రోజుల క్రితం దుర్గాప్రసాద్ క్యాంటిన్‌లో చోరీ జరిగి రూ.30 వేల నగదు, కొన్ని సామాన్లు పోయిన పరిస్థితులున్నాయి. ఇది కుటుంబంతో సన్నిహితంగా ఉండే వారు చేసిందేననే కోణంలోనూ దర్యాప్తు సాగిస్తున్నారు. సుమారు రూ.రెండున్నర కోట్లకు పైగా విలువ చేసే ఆభరణాలు పోవడంతో, హౌస్ బ్రేకింగ్ (హెచ్‌బీ)లు చేసే నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఏఎస్పీ పరిశీలన...

జిల్లా క్రైం ఏఎస్పీ ఎ. శ్రీనివాసరావు గురువారం ఉదయం సంఘటన జరిగిన నివాసాన్ని పరిశీలించారు. జాగీలాలు తిరిగిన ప్రాంతం, ఇతర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో ఆధారాలు సేకరించాలని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చోరీ జరిగిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దరి చేరిన 'కానుక'

- జిల్లాలో 91 శాతం పూర్తయిన జేవీకే కిట్ల పంపిణీ
- జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు: 1,095
- విద్యార్థుల సంఖ్య: 1,16,430
- ఇప్పటి వరకు కిట్లు అందుకున్న విద్యార్థులు: 1,05,703
- మిగిలిన విద్యార్థులకు సైతం పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న కిట్లు


విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక స్టూడెంట్ కిట్ల పంపిణీ ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. గత నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా 17 మండలాల వారీగా విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ తీరు, తెన్నులపై విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ప్రతి రోజూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి డేటా తెప్పించుకుంటున్నారు. జిల్లాలోని 1,038 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,16,430 మంది విద్యార్థులకు గానూ ఇప్పటివరకు 1,05,703 మంది విద్యార్థులు జేవీకే కిట్లు అందుకున్నారు.

పాఠశాలకు రెగ్యులర్‌గా హాజరవుతున్న విద్యార్థులకు కిట్లు సక్రమంగానే పంపిణీ చేయగా, గైర్హాజరైన విద్యార్థులకు పంపిణీ చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విధంగా జిల్లాలో జేవీకే కిట్ల పంపిణీ 91 శాతం పూర్తయింది. పాఠశాలలు తెరవకముందే విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన జేవీకే కిట్లకు సంబంధించిన సామగ్రినికి సిద్ధం చేసిన ప్రభుత్వం వాటిని ఎప్పటికప్పుడు మండలస్టాక్ పాయింట్లకు సరఫరా చేయించి, కిట్లు రూపంలో సిద్ధం చేయించింది.

10 రకాల సామగ్రి ఉచితం..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు సకల వసతులతో ఆధునిక విద్యను అందిస్తున్న ప్రభుత్వం ఒక్కోటి రూ.2500 విలువ కలిగిన జేవీకే కిట్ ద్వారా 10 రకాల సామగ్రి ఉచితంగా అందజేస్తోంది. బ్యాగులు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్టుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా ఎంతో ముందు చూపుతో ఖర్చు చేస్తున్న ప్రతి పైసా సద్వినియోగం కావాలనే ఉద్దేశంతో మూడంచెల క్వాలిటీ చెకప్ విధానం ద్వారా పూర్తి నాణ్యత కలిగిన సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేసింది.

అథెంటిఫికేషన్ 70 శాతం పూర్తి

పాఠశాలల వారీగా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా కిట్లు పంపిన ప్రభుత్వం వాటిని విద్యార్థులకు అందించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతోంది. ఎక్కడా దుర్వినియోగానికి తావు లేకుండా ప్రతి ఒక్క విద్యార్థికి కిట్ అందజేసిన తరువాత విద్యార్థి తల్లి, సంరక్షుల నుంచి పాఠశాలల్లోనే బయోమెట్రిక్ అథంటిఫికేషన్ నమోదు చేయిస్తున్నారు. తద్వారా ప్రభుత్వం అందజేసిన జేవీకే కిట్‌ను భద్రపర్చడం, జాగ్రత్తగా చూసుకోవడంపై తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు చేపట్టారు. జిల్లాలో ఇప్పటి వరకు 91 శాతం మేరకు పంపిణీ పూర్తవగా, పేరెంట్ బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ 70 శాతం పూర్తయింది. మిగిలిన విద్యార్థులకు సైతం పంపిణీ చేసేందుకు సిద్ధంగా కిట్లను ఉంచారు.

నాణ్యత లేని బ్యాగులు తిప్పి పంపుతున్నాం

పాఠశాలల్లో జేవీకే కిట్ల పంపిణీ తుది దశకు చేరుకుంది. ప్రతి ఒక్క విద్యార్థికి కిట్ అందజేస్తున్నాం. బూట్ల సైజులో తేడాటున్నచోట వాటిని ఆయా పాఠశాలల నుంచి వెనక్కు తెప్పిస్తున్నాం. అదే విధంగా పాడైన బ్యాగులను సైతం వెనక్కి తెప్పించి, సరఫరాదారులకు పంపి, తిరిగి మంచి బ్యాగులను తెప్పించేందుకు ఏర్పాట్లు చేశాం.
– జి.విజయలక్ష్మి, ఏపీసీ, సమగ్రశిక్ష, గుంటూరు

న్యాయం చేయాలంటూ మృతదేహంతో ధర్నా

- మైనర్ బాలిక అనుమానాస్పద మృతిపై పేరేచర్ల జంక్షన్లో బంధువుల నిరసన
- నేరస్తులను శిక్షిస్తామంటూ డీఎస్పీ హామీ

మేడికొండూరు: పేరేచర్ల తెల్లక్వారీ కాలనీకి చెందిన మైనర్ బాలిక తమ్మిశెట్టి సంధ్య (17) అనుమానాస్పద మృతిపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలిక మృతికి కారులైన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని, తగిన న్యాయం చేయాలంటూ పేరేచర్ల జంక్షన్లో గురువారం మృతదేహన్ని తీసుకువచ్చి సుమారు రెండు గంటల సేపు ధర్నా నిర్వహించారు. ట్రాక్టర్‌లో మృతదేహాన్ని తీసుకువచ్చి ప్రధాన కూడలిలో ఉంచి రోడ్లపై బైఠాయించి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న దక్షిణ మండల డీఎస్పీ మెహబూబ్ బాషా, నల్లపాడు సీఐ బత్తుల శ్రీనివాసరావుల హుటాహుటిన జంక్షన్‌కు వచ్చి మృతురాలి బంధువులతో మాట్లాడారు. మృతికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షపడేలా చూస్తానని డీఎస్పీ హామీ ఇవ్వడంతో సుమారు రెండు గంటలకు పైగా సాగిన ధర్నాను విరమించి మృతదేహన్ని తీసుకువెళ్లారు. ఈ ధర్నాతో నిత్యం వాహనాల రద్దీతో ఉండే పేరేచర్ల జంక్షన్ నరసరావుపేట, సత్తెనపల్లి, గుంటూరు, చినపలకలూరు మార్గాలలో సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలిచి పోయాయి. ప్రయాణికులు పలురకాలుగా ఇబ్బందులు పడ్డారు. మేడికొండూరు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కృష్ణా, పశ్చిమ గోదావరి టెస్ట్ మ్యాచ్ డ్రా

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–19 బాలుర టెస్ట్ మ్యాచ్‌లో భాగంగా పశ్చిమ గోదావరి, కృష్ణా జట్ల మధ్య జరిగిన మూడు రోజుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. బుధవారం రెండో రోజు నాటి ఓవర్ నైట్ స్కోర్ ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జట్టు 326 పరుగులకు ఆలౌట్ అయింది. పశ్చిమ గోదావరి జట్టు బౌలర్ సాయితేజ ఐదు వికెట్లు సాధించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు 195 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని రేవంత్‌నాగ్ 51, సూర్యనాగ్ 43 పరుగులు సాధించించారు. కృష్ణా జట్టు బౌలర్ చిన్నా ఐదు వికెట్లు, గీత్ మూడు, యోచన్ రెండు వికెట్లు సాధించారు.

అభివృద్ధి, సంక్షేమం సక్రమంగా అమలు జరగాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ ఎం.వేణుగోపాల రెడ్డి, జేసీ రాజకుమారి

పాతగుంటూరు: జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్దేశిత లక్ష్యాల మేరకు సక్రమంగా అమలు జరిగేలా నిరంతరం పర్యవేక్షిస్తూ పటిష్ట ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి అధికారులకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి వీడియో కన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టరేట్‌లోని వీసీ హాలులో కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ వేణుగోపాలరెడ్డి అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్దేశిత లక్ష్యాల మేరకు జాబ్ కార్డుదారులకు పనులు కల్పించాలన్నారు. రెండవ దశలో జగనన్న పాలవెల్లువ అమలు చేసే గ్రామాల్లో పాల సేకరణకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలను నిర్దేశిత సమయంలో సక్రమంగా పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించి వీలైనంత వరకు క్యాంపులు నిర్వహించే రోజే ప్రజలకు ధ్రువపత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూముల రీసర్వేకి సంబంధించి నిర్దేశిత ప్రక్రియలన్నీ సక్రమంగా నిర్వహించాలన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న ఇరువురు వ్యక్తులతోపాటు, ఒక బాలుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌లు గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సంజీవయ్య నగర్ 1వలైను వద్ద కొందరు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడిచేశారు. సంజీవయ్యనగర్‌కు చెందిన పాతర్తూరి యశ్వంత్, నగరాలుకు చెందిన తమ్మిశెట్టి వినోద్, మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి కేజీ 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. యశ్వంత్, వినోద్‌లను అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంతో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు.

బాబూ.. రాజధానిలో పేదలు ఉండకూడదా?

అదే మీ లక్ష్యం అనుకుంటా!
- ఎమ్మెల్యే ఆర్కే
- రైతుల ముసుగులో చంద్రబాబు అనుచరులు కోర్టులో పిటీషన్లు
- చివరకు న్యాయమే గెలుస్తుంది
- ఎట్టి పరిస్థితుల్లో ఇళ్లు నిర్మించి తీరుతాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలకు సొంత ఇల్లు ఉండాలని రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల మందికి ఇళ్ల ప్లాట్లు కేటాయించి ఇప్పటికే 25 లక్షల మందికి నివాసాలు కట్టి ఇచ్చారు. దానికి భిన్నంగా చంద్రబాబు నాయుడు తన కలల రాజధానిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీలు ఉండకూడదని కుయుక్తులు చేస్తున్నారని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం గుంటూరు జిల్లా కుంచనపల్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంతరం విలేకరులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో సీఆర్‌డీఏ నిబంధనల ప్రకారం 53 వేల మంది పేదవారికి నివాస స్థలాలు ఇవ్వాల్సి ఉంది. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు రాజధానిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఉండకూడదని దురుద్దేశంతో వారికి ఇళ్ల ప్లాట్లను కేటాయించ లేదు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఉన్న అడ్డంకులన్నీ అధిగమించి బడుగు బలహీన వర్గాలకు చెందిన 53 వేల మందికి ఇళ్ల స్థలాలను కేటాయిస్తే రైతుల ముసుగులో చంద్రబాబు నాయుడు ఇళ్ల ప్లాట్లు కేటాయించడానికి వీలులేదంటూ కోర్టును ఆశ్రయించారు. అందులో కూడా సామాజిక అసమానతలు దెబ్బతినే విధంగా ఎలా ప్లాట్లు కేటాయిస్తారని ఆ పిటీషన్‌లో పేర్కొనడం విశేషం. గౌరవ న్యాయస్థానం ఆ పిటీషన్‌ను తోసిపుచ్చుతూ రాజధానిలో నిబంధనలకు లోబడి ప్లాట్లు కేటాయించవచ్చంటూ తెలియజేసింది. దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 53 వేల మందికి ప్లాట్లు కేటాయిస్తే, ఇళ్ల నిర్మాణం చేయడానికి వీలులేదంటూ రైతుల ముసుగులో చంద్రబాబు అనుచరులు పిటీషన్ వేయడం దారుణమన్నారు. ఆ పిటీషన్‌కు లాయర్లకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారంటే వారికి పేద ప్రజలపైన ఎటువంటి గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశ ప్రధాని, కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి నిధులు కేటాయించింది. దానికి సహకారంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయిస్తూ ఇళ్లను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తుంటే చంద్రబాబునాయుడు వారి కుమారుడు లోకేష్‌లు దుర్మార్గపు ఆలోచనతో పేదలు ఇళ్లు నిర్మించుకోకూడదని కుయుక్తులు పన్నుతున్నారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానానికి సమాచారం ఇచ్చి 53 వేల నివాసాలు నిర్మించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.

అత్యుత్తమ నాక్ గ్రేడ్ సాధనే లక్ష్యం

- వీసీ ఆచార్య పి. రాజశేఖర్
- యూనివర్సిటీ సమర్థతకు నాక్ గ్రేడ్ కొలమానం
- నాక్ ఏర్పాట్లపై అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం


సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: యూనివర్సిటీకి అత్యుత్తమ నాక్ గ్రేడ్ సాధనే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. త్వరలో నాక్ బృందం పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లపై యూనివర్సిటీ అధ్యాపకులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీ సమర్థతకు నాక్ గ్రేడ్ కొలమానం అనే విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. ఏఎన్‌యూలో అంతర్జాతీయ మౌలిక వసతులు ఉన్నాయని, వాటితోపాటు విద్య, బోధన, పరిశోధనాంశాల్ని నాక్ బృందానికి సమర్పిస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. నాక్‌కు సమర్పించాల్సిన ఎస్ఎస్ఆర్(సెల్ఫ్ స్టడీ రిపోర్ట్) రూపకల్పనకు అవసరమైన సమాచారాన్ని ఆయా విభాగాధిపతులు, అధ్యాపకులు వెంటనే సంబంధిత విభాగానికి అందజేయాలని ఆయన ఆదేశించారు. దీంతో పాటు ఆయా విభాగాల్ని నాక్ బృందం సందర్శనకు సిద్ధం చేయాలని విభాగాధిపతులకు చెప్పారు. అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు సమష్టిగా ముందుకు సాగితే నాక్ గ్రేడ్ సాధనలో అనుకున్న లక్ష్యాన్ని తప్పకుండా సాధించగలుగుతామని తెలిపారు. నాక్ బృందం పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు తాను ఇప్పటికే పలుమార్లు ఆయా విభాగాల్లో పర్యటించానని, రానున్న రోజుల్లో కూడా ఆకస్మిక పర్యటనలు చేస్తానని ఆయన చెప్పారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి మాట్లాడుతూ నాక్‌కు సంబంధించిన సమాచారం అందజేసేందుకు అధ్యాపకులందరూ అత్యధిక ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ ప్రసంగిస్తూ ఎస్ఎస్ఆర్ రూపకల్పన బృందం కోరుతున్న సమాచారాన్ని ఆయా విభాగాలు వెంటనే అందజేస్తే పకడ్బందీగా రూపొందించగలుగుతామని తెలిపారు. ఐక్యూఏసీ విభాగం కో–ఆర్డినేటర్ ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి, ఆచార్య గంగాధరరావు, ఆచార్య జాన్సన్, ఆచార్య సిద్ధయ్య, ఆచార్య ప్రమీలారాణి, ఆచార్య శ్రీనివాసరెడ్డి, డిగ్రీ పరీక్షల కో–ఆర్డినేటర్ ఆచార్య సంధ్యాకోల్, పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

నరసరావుపేట: ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలు, సబ్సిడీలను ఉపయోగించుకొని ఎస్సీ, ఎస్టీలు అభివృద్ధి పథంలో పయనించాలని డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో నవోదయంకు దరఖాస్తు చేసుకున్న వారికి బ్యాంకు రుణాలు, పథకాలపై అవగాహన నిర్వహించారు.